# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లా బాణసంచా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**

**2. వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సహకారం అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని కోరారు.**

**3. చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.**

**4. ఆంధ్రప్రదేశ్‌ను చలనచిత్ర, టెలివిజన్ రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

==========================

దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా పరిశ్రమలు, విద్య తదితర శాఖలకు సంబంధించి జరిగిన చర్చలో ముఖ్యమంత్రి నిన్న మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే మొత్తం 6 లక్షల 28 వేల 327 ఉద్యోగాలు కల్పించామని, ఈ ఐదేళ్లలో 20 లక్షల కంటే ఎక్కువ ఉద్యోగాలే కల్పిస్తామని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

..వాయిస్.. 25 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకూ 26 మంది మృతి చెందటం అత్యంత బాధాకరమని అన్నారు. శాసనసభలో ఈ ఘటనపై ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. ప్రస్తుతం ఆరుగురు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ప్రభుత్వ పరంగా బాణసంచా పేలుడు బాధితులందరినీ ఆదుకుంటామని ముఖ్యమంత్రి తెలియచేశారు.

--------------------------

వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సహకారం అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.

రేవంత్ రెడ్డి కేంద్రప్రభుత్వాన్ని  కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్న ఢిల్లీలో సమావేశమై అంశాలపై చర్చించారు. జనజీవన స్రవంతిలో కలుస్తున్న మావోయిస్టు నాయకులు, ఇంకా అజ్ఞాతంలో ఉన్న వారి గురించి, లొంగుబాట్లు, పునరావాసం తదితర అంశాల గురించి  విస్తృతంగా  చర్చించారు.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి ముఖ్యమంత్రి వివరించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ కార్యకలాపాలు, సైబర్‌నేరాల నియంత్రణలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోషిస్తున్న పాత్ర గురించి వివరించారు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా రాష్ట్రానికి మరింత మంది ఐపీఎస్ అధికారులను కేటాయించాలని  కోరారు.  ప్రస్తుతం తెలంగాణలో 83 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారని ఈ సంఖ్యను 105కు పెంచాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

----------------------------

ఆంధ్రప్రదేశ్‌ను  చలనచిత్ర, టెలివిజన్ రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేస్తామని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో టీవీ రంగ ప్రతినిధులు మంత్రితో నిన్న సమావేశమై టీవీ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను  సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, చలనచిత్ర రంగంతో సమానంగా టెలివిజన్ రంగానికి కూడా గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా భీమిలి వద్ద 'టీవీ నగర్' నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు.  టీవీ నంది అవార్డులను త్వరలోనే ప్రదానం చేస్తామని, ఉగాది పురస్కారాల్లో టీవీ కళాకారులకు ప్రాధాన్యత ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

----------------------------

చేనేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించాలన్నదే  ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగు బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన మూడు చేనేత  విక్రయ కేంద్రాలను మంత్రి నిన్న  ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాళ్లలో  చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, రానున్న జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అన్ని చేనేత ఉత్పత్తులను 50 శాతం తగ్గింపుతో విక్రయించనున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్‌ను అందించనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30 సెకన్లు

----------------------------

ఆంధ్రప్రదేశ్ లోని మంగళగిరి, మూలపాడు క్రికెట్ మైదానాలను అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి స్టేడియం, ఎన్టీఆర్ జిల్లా మూలపాడు క్రికెట్ స్టేడియాలను ఆయన  నిన్న పరిశీలించారు. ఈసందర్భంగా శివనాథ్ పాత్రికేయులతో మాట్లాడుతూ

వాయిస్ ..25.. సెకన్లు

----------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు భారత వైమానిక దళం అగ్నివీర్ వాయు ఓపెన్ రిక్రూట్ మెంట్ ర్యాలీ ఈనెల 9వ తేదీ నుండి ప్రారంభం కానుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల భారత వాయు సేన అధికారి, వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్న ఈ ర్యాలీ ఏర్పాట్లను జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా వింగ్ కమాండర్ మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీలలో ఇరు రాష్ట్రాల మహిళా అభ్యర్థులకు, 12, 13 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్ పురుష అభ్యర్థులకు, 15, 16 తేదీలలో తెలంగాణ పురుష అభ్యర్థులకు ర్యాలీ జరుగుతుందని వివరించారు. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

---------------------------

కోస్తా తమిళనాడు, కోస్తా ఆంధ్రప్రదేశ్ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని, ఒకటి రెండు చోట్ల పొగమంచు కురిసే అవకాశముందని తెలిపింది. రాయలసీమలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2, 3 డిగ్రీల సెంటిగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణా వ్యాప్తంగా పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పలు ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2, 3 డిగ్రీల సెంటిగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశముందని పేర్కొంది.

---------------------------

తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రాల ద్వారా మహిళలకు 30 రకాల ఆరోగ్య పరీక్షలను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ 99 రోజుల కార్యక్రమంపై సంబంధిత ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 46 లక్షల మంది మహిళల ఆరోగ్య వివరాలను తయారుచేస్తున్నట్లు వెల్లడించారు. రేపటి నుంచి జూన్ 12 వ తేదీ వరకు వైద్య, ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించామని మంత్రి దామోదర్ రాజనర్సింహ వివరించారు.

======================